# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 02-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ గుజరాత్ లో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమనాథ్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- ❖ మాదకద్రవ్యాల రహిత భారత్ గా దేశాన్నిమార్చేందుకు అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.
- ❖ తెలంగాణలోనూ విమానాశ్రయాలను అభివృద్ధి చేయనున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ దేశంలో సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడంలో సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ముఖ్యభూమికను పోషిస్తోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

================================

గుజరాత్ లో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు జామ్‌నగర్‌లోని వంటారా, జంతు సంరక్షణ పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ప్రధానమంత్రి సోమనాథ్ దేవాలయాన్ని దర్శించి పూజలు నిర్వహించారు. కాగా రేపు ఉదయం ప్రధానమంత్రి ఆసియా సింహాల నివాసమైన గిర్ జాతీయ పార్కులో సఫారీ రైడ్ లో పాల్గొంటారు. అనంతరం వన్యప్రాణులకు సంబంధించిన సమస్యలను చర్చించడానికి ససన్ గిర్ లో జరిగే 7వ జాతీయ వన్యప్రాణుల బోర్డు సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. వన్యప్రాణులు, అడవుల సంరక్షణ, అభివృద్ధిని ప్రోత్సహించడానికి ఈ బోర్డు పని చేస్తుంది.

మరోవైపు దేశవ్యాప్తంగా మొదలైన రంజాన్ మాసం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పవిత్ర మాసం కరుణ, దయ, సేవ విలువలను గుర్తు చేస్తుందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు.

================================

మాదకద్రవ్యాల రహిత భారత్ గా దేశాన్ని మార్చేందుకు అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా 12 వేర్వేరు కేసుల్లో 29 మంది మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులను న్యాయస్థానం దోషులుగా నిర్ధారించిందన్నారు. అత్యంత సమర్థవంతంగా నిర్వహించిన దర్యాప్తు ఫలితంగా వారికి శిక్ష పడిందని ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. యువతను మత్తు పదార్థాలకు అలవాటు చేస్తున్న వారిపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని అన్నారు.

================================

తెలంగాణలోనూ విమానాశ్రయాలను అభివృద్ధి చేయనున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. హైదరాబాద్ కవాడీగూడలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఈ రోజు ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. వరంగల్ లో మామునూరు విమానాశ్రయ ఏర్పాటు ఇక్కడి ప్రజల చిరకాల ఆకాంక్ష అని అన్నారు. భూ కేటాయింపులు జరగడంతో 8 నెలల్లోనే అనుమతులు ఇచ్చామని చెప్పారు. భూసేకరణ పూర్తయిన రెండున్నరేళ్లలో విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేస్తామని రామ్మోహన్ నాయుడు తెలియజేస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

================================

దేశంలో సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, ఆహార భద్రతను నిర్ధారించడంలో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ముఖ్య భూమికను పోషిస్తోందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేంద్రమంత్రి ఈ రోజు వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు. పప్పుధాన్యాలు, పత్తి, వేరుశనగ నిల్వ, నిర్వహణ, రవాణా ద్వారా ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, ప్రధాన మంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్‌లను విజయవంతంగా అమలు చేయడంలో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ సేవలు ప్రశంసనీయమని తెలిపారు.

================================

అమెరికా - భారత్ ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సానుకూలంగానే ఉన్నాయని విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. ఢిల్లీలోని హన్స్ రాజ్ కళాశాల విద్యార్థులతో ఈ రోజు ముఖాముఖిలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అమెరికా విధానాలు భారత్ కు అనుకూలంగానే ఉన్నాయని తెలిపారు. ఆ దేశంలో సన్నిహిత సంబంధాలు కొనసాగుతాయని కేంద్రమంత్రి తెలియజేస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

విరామం

================================

వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ 'WAVES'లో భాగంగా నిర్వహిస్తున్న క్రియేట్ - ఇండియా చాలెంజ్ విభాగంలో కమ్యూనిటీ రేడియో కంటెంట్ పోటీ కోసం 24 ఎంట్రీలు అందాయని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తెలిపింది. వీటిలో 14 అంతర్జాతీయ ఎంట్రీలు కావటం గమనార్హం. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, కమ్యూనిటీ రేడియో అసోసియేషన్ సహకారంతో WAVES వేదికగా ఈ పోటీని నిర్వహిస్తోంది. స్థానిక సమస్యల పరిష్కారానికి, సమాచార సాధికారతలో కమ్యూనిటీ రేడియో చానళ్ళ పాత్రను తెలియజేస్తూ.. కమ్యూనిటీ రేడియోల సృజనాత్మక, శక్తివంతమైన, విన్నూత్న సమాచారాన్ని తెలియచేయడం ఈ పోటీ ముఖ్యోద్దేశ్యం. కాగా ఈ సంవత్సరం మే 1 నుంచి 4వ తేదీ వరకు ముంబైలో జరుగనున్న వేవ్స్ అంతర్జాతీయ సదస్సు - బ్రాడ్కాస్టింగ్ అండ్ ఇన్ఫోటైన్మెంట్ విభాగం కింద కమ్యూనిటీ రేడియో కంటెంట్ ఛాలెంజ్ జరుగుతుంది.

==================================

ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలోని మన గ్రామంలో మంచు చరియలు విరిగిపడిన ప్రాంతంలో సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనలో 55 మంది మంచులో చిక్కుకోగా వీరిలో 51 మంది కార్మికులను రక్షించారు. వారిలో నలుగురు మరణించారని అధికారులు తెలిపారు. మిగిలిన నలుగురి కోసం ఘటనా స్థలంలో గాలింపు చర్యలు చేపట్టామని ఉత్తరాఖండ్ విపత్తు నిర్వహణ కార్యదర్శి వినోద్ కుమార్ తెలుపుతూ.....

(వాయిస్ 26 సెకన్లు)

==================================

ఓటరు (EPIC) కార్డు నెంబర్ డూప్లికేషన్ ఉండటం అనేది డూప్లికేట్ లేదా నకిలీ ఓటర్లను సూచించదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. రెండు వేర్వేరు రాష్ట్రాల చెందిన ఓటర్లకు ఒకే EPIC నెంబర్ ఉండటంపై ప్రసార మాద్యామాలలో వార్తలు ప్రచారమవుతున్న విషయంపై ఎన్నికల సంఘం ఈ మేరకు స్పందించింది. కొందరు ఓటర్ల EPIC నంబర్లు ఒకేలా ఉన్నప్పటికీ, వారి ఇతర వివరాలు ముఖ్యంగా జనాభా వివరాలు, అసెంబ్లీ నియోజకవర్గం, ఓటింగ్ కేంద్రం పూర్తిగా భిన్నంగా ఉంటాయని వెల్లడించింది. ఏ ఓటరైనా తమ రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికల జాబితాలో నమోదు అయిన తన నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ కేంద్రంలో మాత్రమే ఓటు వేయగలరని, మరెక్కడా వేయలేరని స్పష్టం చేసింది.

==================================

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్-ఏలో భాగంగా దుబాయ్ వేదికగా భారత్ న్యూజిలాండ్ జట్ల మధ్య ఈ రోజు క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచి న్యూజిలాండ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన భారత్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. అనంతరం 250 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన న్యూజిలాండ్ జట్టు కడపటి వార్తలు అందే సమయానికి 25 ఓవర్లకు గాను 2 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. కాగా ఈ రోజు మ్యాచ్ లో విజేత అయిన జట్టు మంగళవారం జరిగే సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో పోటీ పడనుంది.

==================================
==================================